11022024-MAI-06_Layout 1 2/11/2024 4:37 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

భూలచ్చువమ్మా

పిడికెడు
ఇత్తనాలను చల్లితే
గుమ్మిలకొద్దీ కంకుల్ని కాన్వయే పుడమి
ఎప్పటికీ కన్న తల్లే!

ఈడ
అమ్మ కోసం
కొమ్మకు పూచిన రెమ్మల చిగురులు సైతం
చిట్టచివరి శ్వాస వరకు
పట్టు వీడని యుద్ధాలు చేసి
అమరత్వమైన ఆనవాలున్నయి

ఇది
వట్టి మట్టి కాదు
నేనే పోటుగాన్ని
అనుకున్న గట్టి తలలనెన్నో
పాట్టుపాట్టుగా
మట్టుపెట్టిన మహిమ గల పట్టి

ఈ మట్టిలోనే
బతుకును చూసుకొని
జీవితమనుకున్న వాళ్లం
మట్టి కణకణంలో విలీనమైనోళ్లమే కానీ,
మలినం అనుకున్నోళ్లం కాదు

ఆకలైనప్పుడల్లా
పసి పిల్లాడిలా దోసిలి పడితే
తన కడుపును చీల్చుకుని
మన కడుపుల దూప తీర్చి
ముసిముసిగా నువ్వుకున్న భూమంటే
ప్రాణం

ఏడ పుట్టినమో
చచ్చినంక ఆ మట్టి ఒడిలోనే
వెచ్చగ ఒదిగిపోవాలనుకునే ప్రేమ పిచ్చోళ్లం

అందరు
మెచ్చుకునే ఆకుపచ్చని శాసనాలను
తన ఎదల మీద
అచ్చు పోసుకున్న అవని అంటే గౌరవం

పెట్టెడు
బంగారం, వజ్రవైడూర్యాల కన్నా
తట్టెడు మన్ను గొప్పదని తత్వమెరిగినోళ్లం

గెట్ల కాడ
నెత్తులు పట్టుకోని
అడుగు జాగకు జగడమాడిన
మూర్ఖులం
అలుకగా అమ్మ నేల నమ్ముకుంటాం

నేలను
భూలచ్చువమ్మా.. అని కొలుచుకునేటోళ్లం
వేలానికి
తూకమేసి కోసి కొలిచేటోళ్లం కాదు!

చిక్కొండ్రరవి
95023 78992

తెలుగు సాహిత్య మహాసభ - 2024

తెలంగాణ సామాజిక, రాజకీయార్థిక చలనాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక ప్రత్యక్ష సాక్ష్యం. 1919వ సంవత్సరంలో ఏర్పాటైన తెలుగు శాఖ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలను నెలకొల్పుతూ వందేండ్లను పూర్తి చేసుకుంది. సాధికారికమైన పరిశోధన విలువలను తెలుగు సమాజానికి అందించిన తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వేదికగా 2024 ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో 'తెలుగు సాహిత్య మహాసభ – 2024' జరుగనున్నది. ఓయూ తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీం ఈ సభకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా తెలుగు భాష, సాహిత్య, పరిశోధన రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు పాల్గొంటారు. అలాగే వివిధ భాష, సాహిత్య విషయాల్లో నిష్ణాతులైన 100 మంది విషయ నిపుణులు పత్ర సమర్పణ చేస్తారు. సాహిత్య శిల్పం, సాహిత్య మూల్యాంకనం అనే అంశాలపై ప్యానెల్ డిస్కషన్లు ఉంటాయి. సాహిత్యాన్ని సాధారణ ప్రజలు, విద్యార్థుల వరకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 15, 16 తేదీల్లో సాహిత్య, కళాభిమానుల కోసం 'కవితా పొద్దు, కవితా వసంతం' అనే కవి గాయక సభలను నిర్వహిస్తున్నారు. కళాభిమానులు పాల్గొని కవిగాయక సభలను విజయవంతం చేయాల్సిందిగా కన్వీనర్ ప్రొఫెసర్ సి.కాశీం కోరారు.

అపురూప కళ.. అరుదైన ప్రదర్శన!

భారతీయ కళాజగత్తు విశ్వజనీనమైంది. అదే సమయంలో తనదైన విశిష్టతనూ కలిగి ఉంటుందనేది తెలిసిందే. ఇది స్థానిక, విదేశీ కళాకారీతుల సమాగమ ఫలితం. ఈ సమాగమానికి నిలువెత్తు దర్పణం లాంటి కళా ప్రదర్శనకు త్వరలో తెరలేవబోతున్నది. చార్‌సా పురానా షహర్ ఓ అపురూపమైన కుంచెల పండుగకు.. అరుదైన కళా సమ్మేళనానికి వేదిక కాబోతున్నది.

విశిష్ట సాంస్కృతిక కేంద్రంగా, విశ్వనగరంగా వినుతికెక్కిన హైదరాబాద్ నగరం ఓ బృహత్తర కళా ప్రదర్శనకు దివిటీ పట్టబోతున్నది. 200 మంది కళారంగ దిగ్గజాల కళాకృతులు ఈ మహాప్రదర్శనలో కొలువుదీరనున్నాయి.

2024 ఫిబ్రవరి 17 నుంచి మార్చి 7 వరకు మాదాపూర్‌లోని చిత్రమయీ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరిగే ఈ ఆర్ట్ ఫెస్ట్‌కు వినూత్నమైన రీతిలో 'న్యూస్ ఆర్ట్ ఫెస్ట్ 2024' అని పేరుపెట్టారు. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్.. అంటే ఇంగ్లిష్‌లో నలుదిక్కులు గుర్తు చేసే 'న్యూస్' అనే మాట ఈ భారీ ప్రదర్శన పేరులో ఉండటం దీని విస్తృతిని తెలియజేస్తున్నది. అంతకుముందు ఫిబ్రవరి 12 నుంచి 17వ తేదీ వరకు ఆర్ట్ క్యాంపు జరుగనున్నది. ఇండియా ఫైన్ ఆర్ట్ (ముంబై) ఆధ్వర్యంలో ఈ మహా కళా ప్రదర్శన జరుగుతుంది. ప్రముఖ కళాకారులు డాక్టర్ లక్ష్మణ్ ఏలె, బోల్గమ్ నగేశ్ గౌడ్, ఇండియా ఫైన్ ఆర్ట్ (ముంబై) వ్యవస్థాపకుడు మన్వీందర్ దాపర్ ఈ కళాప్రదర్శనకు క్యూరేటర్లుగా వ్యవహరిస్తున్నారు. వివిధ కళాధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశం నలుమూలలకు చెందిన 200 మందికి పైగా కళాకారులు ఇందులో పాల్గొంటుండటం విశేషం. ఉత్తరాది నుంచి అంజలీ ఇళా మీనన్, శోభా బ్రూటా తదితరులు, దక్షిణాది నుంచి లక్ష్మాగౌడ్ వైకుంఠం, రవీందర్‌రెడ్డి తదితరులు, తూర్పు నుంచి జోగెన్ చౌదరి, సుహాస్ రాయ్, చంద్ర భట్టాచార్య, పశ్చిమం నుంచి రినీ ధుమాల్, రేఖా రాడ్విట్టియా, ఇంద్రప్రమిత్ రాయ్, సురేంద్రన్ నాయర్, వృందావన్ సోలంకి తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

హైదరాబాద్ మహానగరంలో ఇటీవలి కాలంలో ఇంత పెద్దయెత్తున కళా ప్రదర్శన ఏర్పాటు కావడం ఇదే ప్రథమం. కళా చరిత్రపై ఉపన్యాసాలు, జానపద కళలపై, నూతన కళారీతులపై వర్క్‌షాపులు, చలనచిత్ర ప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వాక్‌త్రూస్, ప్యానెల్ డిస్కషన్లు కూడా ఏర్పాటు చేయడం విశేషం. దేశంలోని సమకాలీన ధోరణులు, శైలులు ప్రతిబింబించేలా ఎంపికలు జరిగాయి. చేయితిరిగిన కళాకారులే కాకుండా కెరీర్ మధ్యలో ఉన్నవారు, ప్రోత్సాహం, తోడ్పాటు అవసరమైన యువకళాకారులకు చోటు కల్పించడం ఈ ప్రదర్శన ప్రత్యేకతగా చెప్పాలి.

తుమ్మలపల్లి రఘురాములు
91827 77750

ఈ సమ్మేళనంలో దేశం నలుమూలల పురుడుపోసుకున్న వివిధ రకాల శైలులను ఒకచోటికి చేర్చి, వాటి మధ్య అనుసంధానం చేయడమే ప్రదర్శన పరమోద్దేశమని క్యూరేటర్లలో ఒకరైన డాక్టర్ లక్ష్మణ్ ఏలె చెప్పారు. ప్రదర్శనలో కళాకారుల నుంచి ఆహ్వానించిన పెయింటింగ్‌లు, శిల్పాలు, ఇన్‌స్టాలేషన్లు, న్యూమీడియా ఆర్ట్ తదితర కళాకృతులను ప్రదర్శిస్తారు. ఇక థీమ్ విషయానికి వస్తే పౌరాణిక, ఆధ్యాత్మిక, ప్రకృతి, భావనాత్మక చిత్రణలు ఇలా అన్నిరకాల ధోరణులకు స్థానం కల్పించారు. తొలినాళ్ల ఆధునిక కళ నుంచి నేటి వరకు పాడుపూపిన విభిన్న ధోరణులను సమతూకం చేసేందుకు ప్రయత్నించి నట్టు మరో క్యూరేటర్ నగేశ్ గౌడ్ వెల్లడించారు. బాంబే ప్రోగ్రెసివ్ గ్రూప్, కోల్‌కతా గ్రూప్, మద్రాస్ స్కూల్, బరోడా నెరేటివ్ ఫిగరేటివ్ వంటి విభిన్న కళోద్యమ సంస్థలు, బృందాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించారు. మూర్త, అమూర్త వ్యక్తీకరణతో గీసిన చిత్రాలు నాటి, నేటి కళాధోరణులను కండ్లకు కట్టేలా ప్రదర్శనలు ఉంటాయి. మట్టి, చెక్క, ఉక్కు, కాంస్యం తదితర విభిన్న మాధ్యమాలతో రూపొందించిన విభిన్న శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పొచ్చు. ఇక సాంస్కృతిక ప్రదర్శనల విషయానికి వస్తే.. ఆర్ట్ క్యాంపు మొదలయ్యే ఫిబ్రవరి 12 నుంచి ముగింపు రోజు మార్చి 7 వరకు వివిధ రకాల ప్రదర్శనలు జరుగుతాయి. ఆర్ట్ క్యాంపులో శోభా బ్రూటా, ప్రభాకర్ కోత్టె, వి.రమేశ్ తదితర 12 మంది సీనియర్ కళాకారులు పాల్గొంటారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఫిబ్రవరి 18న జయవంత్ నాయుడు హవాయి గిటార్ కచేరీ, 23న సంజయ్ అష్టపుత్రే సితార్ కచేరీ ఉంటాయి. అదే విధంగా మార్చి 3న రాజ్ ఆర్ దర్శకత్వం వహించిన '8 ఏఎం మెట్రో' చిత్ర ప్రదర్శన జరుగుతుంది.



పత్తి గింజల్లెక్క

పత్తి శేన్ల
గడ్డికప్పిన మొక్క మొక్కకు
కలుపు తీశి ఎల్లిపోతుంటే
అవ్వ కాళ్లకు మొక్కలన్నీ
వంగి వంగి దండాలు పెట్టేవి

మొక్కలెండిపోతుంటే.. గొంతెండిపోతున్నా నాయిన
పాయలు పాయలుగా పాపడ దీశినంత సక్కంగా
సాల్లు దీశి నీళ్లు తాపినప్పుడు
సాలు సాలు నాయిన గరుకు
శేతులను గావురంగా ముద్దాడేటివి

రోగమొచ్చి ఆకులన్నీ ముడుసుకున్న పత్తి శెట్లను
జ్వరమొచ్చి మలుసుకుపన్న శిన్న శెల్లెని
జూసుకున్నంత
పాయిరంగ జూసుకునేటిది

మబ్బు తునుకలు తునుకలుగా ఇరిగి నేలమీద పడ్డట్టు
శేను శేనంతా ఇచ్చుకున్న పత్తి కాయలు
నల్లరేగడి తీరు ముఖాలపై పూసిన నవ్వులు
ఒక్కతీరుగనె ఉంటయి

శేను శేనంతా పూసిన పత్తి బుగ్గల మీద
ప్రేమగా నిమిరి సంబురపడ్డ ఆ ఇద్దరూ..
ఇశిరిశిరి కొట్టిన ముసురు వానల
నేలరాలిన పత్తి నీళ్లల్ల కొట్టుకుపోతుంటే
చేతికచ్చిన కొడుకు కండ్లముందట కాలం జేస్తే
గుండెపగిలి సచ్చినట్టూ..

రెక్కల కట్టం నీళ్లల్ల కలిసి
తెల్లగా తేలాడుకుంటా పోతుంటే
అవ్వా నాయినలు
మట్టిపెడ్డల కింద మొలువని
పత్తి గింజల్లెక్క మట్టిల గలిసిపోయిండ్రు

దిలీప్.వి
84640 30808

ఉద్యమాల ఊపిరి.. ఉరిమే గీతమే

అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుందని అన్నారు ప్రజాకవి కాళోజీ. అవును, అది అక్షరాలా నిజం. ఇక అక్షర రూపం దాల్చి లక్ష మెదళ్లను కదలించగల ఆ సిరాచుక్కే గీత రూపంగా కూడా మారగలిగితే, అనంతమైన శక్తిని తనలో నిక్షిప్తం చేసుకొని లక్ష మెదళ్లనే కాదు కోట్లాది మెదళ్లను కూడా కదిలించగలుగుతుంది. ఆ శక్తిని సక్రమంగా వినియోగించుకోగలిగితే అద్భుతాల సృష్టి సంభవమవుతుంది. ఇదే సత్యాన్ని ప్రపంచ చరిత్రలోని ప్రతి మలుపులో నిరూపించింది గీత సాహిత్యం. ప్రపంచంలోని ఏ ఉద్యమాన్ని పరిశీలించినా, దాని వెనుక ఆ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన గీత సాహిత్యం మనకు దర్శనమిస్తుంది.



భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆ ఉద్యమానికి ఒక మంత్రంగా మారిన బంకించంద్ర విరచిత వందేమాతర గీతం, మహోద్యమ జ్వాలని ఆరనీయకుండా కాపాడింది. బ్రిటిష్ వాళ్ల గుండెల్లో భూకంపాల్ని సృష్టించింది. అంతేకాదు, తెల్లవాడి తుపాకి గుండ్లకు బలై నేలకొరుగుతున్న స్వాతంత్ర్య సమరయోధుల పెదాలపై పలికింది. చివరి శ్వాస వరకు వారికి తోడుగా నిలిచింది. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు వందేమాతరమంటూ ప్రాణాల్ని వదిలారు. ఖుదీరాం బోస్, మదన్‌లాల్ ధింగ్రా, కన్హయ్యలాల్ లాంటి విప్లవ వీరులెందరో ఉరికంబం ఎక్కేముందు వందేమాతరమని గర్జిస్తూ విప్లవకారులందరికీ స్ఫూర్తిదాతలుగా నిలిచారు.

ఉద్యమాన్ని అణచివేయాలని ఆ రోజుల్లో వందేమాతరమన్న ప్రతి ఒక్కరినీ బంధించింది బ్రిటిష్ ప్రభుత్వం. లాఠీలతో కొట్టించింది. కాల్పులు జరిపింది. అయినా స్వాతంత్ర్యోద్యమం ఆగలేదు. అందుకు ప్రధాన కారణం వందేమాతర గీతం. అంతేకాదు, ఆ గీతంలోని తొలి చరణాలు, రానురాను భారత జాతి జీవనవిధానంలో అంతర్భాగమైపోయాయి. ఇద్దరు వ్యక్తులు వీధుల్లో తారసపడ్డా.. వందేమాతరం అంటూ పలకరించుకొనేవాళ్లు.

భారత స్వాతంత్ర్య సమరానికి ఊపిరిగా నిలిచి, ఆనాటి ఉద్యమకారులందరికీ ఒక తారకమంత్రంగా మారిన వందేమాతర గీతాన్ని 1875లో బంకించంద్ర చటర్జీ రాశారు. అదే ఏడాది బంగ దర్శన్ పత్రికలో అది ప్రచురితమైంది. ఆ పత్రికలోనే 1880–1881 మధ్యకాలంలో బంకించంద్ర రాసిన నవల 'ఆనంద మఠ్' ధారావాహికగా ప్రచురితమైంది. ఆ నవలలోని భవానందుడనే పాత్రతో వందేమాతరం గీతాన్ని పలికించారు చటర్జీ.

ఇక నేతాజీ సుభాష్ చంద్రబోస్ సారథ్యంలోని ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాటాన్ని గమనిస్తే, 1942లో వంశీధర్ శుక్లా రచించిన 'కదం కదం బడాయె జా' అన్న గీతం ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాట యోధుల అడుగులో అడుగైంది. వారిలో స్ఫూర్తిని జనింపజేస్తూ తొలి భారత స్వతంత్ర (తాత్కాలిక) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో దోహదపడింది. ఆ గీతంలోని ఉద్వేగ భావాన్ని గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం దాన్ని నిషేధించింది. ఎవరైనా ఆ గీతాన్ని ఆలపిస్తే వారిని రాజద్రోహ నేరం కింద జైల్లో పెట్టేవారు.

> తెనుగునాట స్వాతంత్ర్యోద్యమంపై పాటల ప్రభావాన్ని గమనిస్తే, ప్రజా పాటల త్యాగయ్యగా పేరుగాంచిన గరిమెళ్ల సత్యనారాయణ రాసిన 'మాకొద్దీ తెల్ల దొర తనం' గేయం స్వాతంత్ర్య సమరయోధుల్లో కొత్త ఉత్సాహానికి, ఆవేశానికి జీవం పోసింది. ఆ గేయ ప్రభావంతో ఆవేశపూరితులైన ఎందరో యువకులు స్వాతంత్ర్య సంగ్రామంలోకి దూకారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల వెంకట రామారావు కలం నుంచి జాలువారిన 'వీరులకు కాణాచిరా' గీతం సాయుధ పోరాట యోధులకు స్ఫూర్తిగా నిలిచింది. బండి యాదగిరి రాసిన 'బండెనుక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి, ఏ బండ్లో పోతవు కొడుకో నైజాం సర్కరోడా' అన్న పాట జన బాహుళ్యంలో ఎంతగా ప్రభావం చూపిందో అందరికీ తెలిసిందే. అంతేకాదు, నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన దాశరథి రచించిన 'ఓ నిజాము పిశాచమా! కానరాడు నినుబోలు రాజు మాకెన్నడేని' గీతం అందరూ ఎరిగినదే. నిజాం ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగడుతూ ప్రజాకవి కాళోజీ 'నల్లగొండలో నాజీ శక్తుల నగ్న నృత్యమింకెన్నాళ్లు..' అంటూ ప్రశ్నించారు. ప్రముఖ కవి సుద్దాల హనుమంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడా పసుల గాసే మొనగాడా!' పాట నిజాం పాలనలో పేదపిల్లల దీనస్థితిని వర్ణించింది.

తర్వాతి కాలంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంపై పాటల ప్రభావం ఎంతగా ఉందనేది అందరికీ తెలిసిందే. ఆ రోజుల్లో తెలంగాణ అంతటా ప్రతిధ్వనించిన గద్దర్ గజ్జె కట్టి ఆడిన 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా.. వీర తెలంగాణమా!' పాట విని ఆవేశపడని తెలంగాణ బిడ్డ ఉండడు. అయన రాసిన మరో పాట 'అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా!' ఆ నాటి తెలంగాణ దైన్యస్థితికి దర్పణం పట్టింది. గోరటి వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో..' పాట పాలకుల కుట్రల వల్ల పల్లెల్లో కులవృత్తులు ఎలా అడుగంటాయో కండ్లకు కడుతుంది. నందిని సిధారెడ్డి రాసిన 'నాగేటి సాలల్ల నా తెలంగాణ..', అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' తదితర పాటలు తెలంగాణ నలుమూలలా ప్రతిధ్వనించాయి. రామగుండం మండలం మొర్మూరుకు చెందిన మల్లాపజ్జల సదాశివుడు రాసిన 'తలాపున పారుతుంది గోదారి.. నీ చేను నీ చెలుక ఎడారి..' పాట తెలంగాణ రైతుల కన్నీటి గాథకు దర్పణంగా నిలుస్తుంది. గూడ అంజయ్య అనగానే గుర్తుకొచ్చే పాట 'ఊరు మనదిరా..'. తెలంగాణ పల్లెల్లో దోపిడీకి గురైన సబ్బండ వర్గాలను ఉర్రూతలూగించింది ఈ పాట. కవి జైరాజ్ కలం నుంచి వెలువడిన 'వానమ్మా' పాట తెలంగాణ పల్లెల దౌర్భాగ్యాన్ని వర్ణించింది.

బసవరాజు నరేందర్‌రావు
99085 16549

ప్రపంచంలోని ఏ ఉద్యమ చరిత్ర చూసినా.. ఆ ఉద్యమానికి ఊపిరిగా నిలుస్తుంది గీత సాహిత్యం. పది పేజీల్లో వర్ణించలేని అంతులేని ఆవేశాన్ని, భావనను, ఆత్మీయతని, అద్భుత సందేశాన్ని గీతం లేదా పాట కేవలం నాలుగు చరణాల్లో వర్ణించగలగడమే అందుకు కారణం. భారతదేశ గొప్పదనాన్ని వర్ణించాలని సి.నారాయణరెడ్డిని ఎవరో అడగగా.. అంతులేని భారతదేశ గొప్పదనాన్ని వర్ణించడం గీతం ద్వారా మాత్రమే సాధ్యమని ఆయన చెప్పారట. చెప్పినట్టే.. 'నా దేశం భగవద్గీత.. నా దేశం అగ్నిపునీత సీత.. నా దేశం కరుణాంత రంగ.. నాదేశం సంస్కార గంగ' అంటూ నాలుగు చరణాల్లో దేశ గొప్పదనాన్ని వివరించారాయన. ఇది గీతానికున్న గొప్ప లక్షణం. అంతటి ఘనత ఉన్న గీతం మరుగునపడిపోకుండా కాపాడుకోవడమే మన తక్షణ కర్తవ్యం.

పిడికిలి శిశువు

శిశువుకు కడుపులో ఉన్నప్పుడే
తల్లి స్వరాన్ని గుర్తుంచుకునుడు
నిరంతరంగా మొదటి విద్య!

అమ్మ తన కోసం ప్రసవ వేదనతో
మెలికల అరుపులుగా తండ్లాడుతుంటే
పుట్టకముందే తల్లిని హింసిస్తున్నానని
కడుపులో కన్నీళ్ల పర్యంతం శిశువు!

ఉమ్మ నీరులో కలిసిపోయిన పసి కన్నీటిని
ఎలా గుర్తించగలం
బహుశా నొప్పుల తల్లికి శిశువు నునువెచ్చని
బాష్ప స్పర్శ కడుపంతగా తెలిసే ఉంటుంది

కొన్ని గంటలకు మాతృమూర్తి విశాలమైన
ఒడిలోకి వచ్చాకా
తల్లి ఆనందాన్ని చూస్తూ కడుపు నిండా
క్షీర ధారాపాతాల బలంతో కేరింతలుగా శిశువు!

పురిటి గదిలో శిశువుకు మొదటి పండుగ!
అమ్మను ఎప్పటికీ ఇలాగే సంతోషంగా
ఉంచుతానని శిశువు పిడికిలి
బిగించి ప్రతిజ్ఞ చేస్తున్నాడు!

ఇంకా నాభి తెగి ఒక్క పేరైనా పెట్టుకోలే
తల్లిపై ఎంత ఎరుక!
భవిష్యత్తులో శిశువు ఇలాగే
పిడికిలి బిగిస్తూ ఎన్ని ప్రతిజ్ఞలు చేస్తాడో!

కందాళై రాఘవాచార్య
87905 93638